క్లుప్తంగా

దుర్గమ్మకు నివాళి



దుర్గమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: వేమన దుర్గమ్మ మృతి తమను బాధించిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. సోమవారం చల్లచింతలపూడిలో ఇటీవల మృతి చెందిన దుర్గమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుమారులు మాణిక్యాలరావు, నాగరాజు తదితరులను ఆయన పరామర్శించి, ఓదార్చారు. పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సీతంపేట సొసైటీ చైర్మన్ నల్లూరి వెంకట్రామయ్య (బాబి), వైఎస్సార్ సీపీ నాయకులు కమ్మ నాగు, చిరంజీవి, బ్రహ్మాజీ, రామకృష్ణ తదితరులున్నారు.

ఉంగుటూరు 10వ వార్డు మెంబర్‌గా నాగలక్ష్మి



ఉంగుటూరు: మండలంలో మూడు వార్డు సభ్యుల ఉప ఎన్నికకు గానూ ఒక వార్డు ఏకగ్రీవం అయ్యింది. ఉంగుటూరు 10వ వార్డు మెంబరుగా కాళ్ల నాగలక్ష్మి(వైఎస్సార్ సీపీ మద్దతు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యింది. సోమవారం నామినేషన్ల ఉపసంహరణకు చివరి రోజు కాగా, మిగిలిన ముగ్గురు అభ్యర్థులు ముప్పన రాధిక, మారిశెట్టి సరస్వతి, తుంగ అనూష విత్‌డ్రా కావడంతో కాళ్ల నాగలక్ష్మి ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఇదిలా ఉండగా, కాకర్లమూడి 1వ వార్డుకు రాజాని వరలక్ష్మి, రయి నాగమణి పోటీ పడుతున్నారు. 5వ వార్డుకు గోడి రాజు, తోట దివాకర్ పోటీ పడుతున్నారు.

కళాశాలకు కంప్యూటర్ల వితరణ



కంప్యూటర్లను అందిస్తున్న రాజశేఖర్

పెదపాడు: విద్యార్థులు కళాశాలలో ఉన్న మౌలిక వసతులను సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ కోరారు. స్థానిక జూనియర్ కళాశాలలో ఓఏ కోర్సు అధ్యాపకుడు పసుపులేటి రాధాకృష్ణ, దాతల సాయంతో రెండు కంప్యూటర్లను కొనుగోలు చేసి రాజశేఖర్ చేతుల మీదుగా కళాశాల ప్రిన్సిపాల్ జి.సుబ్రహ్మణ్యేశ్వరరావుకు అందించారు. సీఎం జగన్ జిల్లా ఫస్ట్ వచ్చిన వారికి విట్ కాలేజీలో ఉచిత సీటు ఇవ్వాలన్న ఒప్పందం మేరకు తమ కళాశాల విద్యార్థి సుబ్రహ్మణ్యం జిల్లాలో మొదటి స్థానం సాధించడంతో విట్ అమరావతిలో ఉచిత సీటు లభించిందని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ జెండాలతో ప్రదర్శన



మసీదుపాడులో పాఠశాల వద్ద జాతీయ జెండాలతో ప్రదర్శన చేస్తున్న దృశ్యం

దెందులూరు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక మసీదుపాడు గ్రామంలో జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. హెచ్ఎం బీసీహెచ్ దుర్గాంబ, ఉపాధ్యాయులు తోట ఎడ్వర్డ్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు ర్యాలీలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు ఆర్.రామకృష్ణ, గ్రామస్తులున్నారు.

వైభవంగా సీతారామ స్వామి శాంతి కల్యాణం



తలంబ్రాలు పోస్తున్న అర్చకులు

భీమడోలు: గుండుగొలనులోని ప్రసిద్ధి శ్రీ సీతారామ స్వామివారి ఆలయంలో సోమవారం స్వామి, అమ్మవార్ల జన్మన క్షత్రం పునర్వసును పురస్కరించుకుని శాంతి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండా గంగారాజ్‌కుమార్ పర్యవేక్షణలో యాజ్ఞిక స్వామి దివి గోపాలాచార్యులు, ఆలయ అర్చక స్వామి సాయి సుధీరాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. ఆలయంలోని ధ్రువ మూర్తులకు అభిషేకాలు, ఉత్సవమూర్తు లకు శాంతి కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. అర్చకులు తలంబ్రాలు పోశారు. కోవెల ప్రదక్షిణలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత



పెదవేగి పీహెచ్‌సీలో బ్లాక్ హెల్త్ యూనిట్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



రామశింగవరంలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

- కలెక్టర్ ప్రసన్న వెంకటేష్
- శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

పెదవేగి : రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్టు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. పెదవేగి మండలం రామసింగవరంలో సోమవారం రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. రూ.20.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లీనిక్, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాలను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ప్రారంభించారు. పెదవేగిలో రూ.50 లక్షలతో నిర్మించనున్న బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు ఎమ్మెల్యే శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్ల వద్దకే అందజేస్తోందని చెప్పారు. రామసింగవరంలో రూ.24 కోట్లు అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఖర్చుచేసినట్టు చెప్పారు. జెడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు ద్వారా గాంధీజీ కలలను సాకారం చేస్తున్నారని వివరించారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ రామసింగవరంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లీనిక్ సెంటర్లను ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. రామసింగవరం, బాదరాల రోడ్డు మంజూరయిందని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ సందర్భంగా స్థల దాతలు బాబూరావు, వెల్లవల్లి బాబూరావులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సత్కరించారు.

ప్రజా శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం

ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం రామశింగవరంలో ఐదో రోజు సోమవారం ఆయన జెడ్పీ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్ బాబు, ఎంపీపీ తాతా రమ్యలతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు పొందిన పథకాల లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీ ఆయిల్‌ఫెడ్ రైతు కమిటీ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, డీఎంహెచ్‌ఓ డి.ఆశ, జిల్లా వ్యవసాయశాఖాధికారి వై.రామకృష్ణ, పంచాయితీరాజ్ ఎస్ఈ ఎంవీ రమణమూర్తి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ మెట్లపల్లి సూర్యచంద్రరావు, సొసైటీ అధ్యక్షుడు వెంకట సుబ్బారావు, తహసీల్దార్ ఎస్ నాగరాజు, ఎంపీడీఓ జి.రాజ్ మనోజ్, సచివాలయ మండల కన్వీనర్ కేశన సతీష్, సీతాల రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాచపల్లి గంగాధరరావు, పసుమర్తి మహీంద్ర, సీతాల దాసు, అద్దేపల్లి రాంబాబు, రాచపల్లి రాంబాబు, చింతపల్లి నాగరాజు, వెన్నవెల్లి రవి, గోపిశెట్టి శ్రీను, గోపిశెట్టి రాజు, చళ్లగొళ్ల వెంకటేశ్వరరావు, కామిరెడ్డి నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అన్నిరంగాల్లోనూ ముందంజ



చేబ్రోలులో గ్రామస్తుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- చేబ్రోలులో గడపగడపకు మన ప్రభుత్వం

ఉంగుటూరు: రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనలో అన్ని రంగాలలో ముందంజలో ఉందని ఉంగుటూరు శాసన సభ్యుడు పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం చేబ్రోలులో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ ఏఏ ఇంటికి ఎంత లబ్ధి చేకూరిందో ఆయన వివరించారు. వాసుబాబు మాట్లాడుతూ పరిపాలనను సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామస్థాయికి తీసుకురావడం జరిగిందన్నారు. గ్రామస్తులు సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వెంట జెడ్పీటీసీ సభ్యురాలు కొరిపల్లి జయలక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, పార్టీ మండల కన్వీనర్ మరడ మంగరావు, వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, నారాయణపురం సొసైటీ త్రీమెన్ చైర్మెన్ యెలిశెట్టి పాపారావు బాబ్జీ, మాజీ సర్పంచ్ కరణం బుజ్జి, ఎంపీటీసీ సభ్యులు రాయిలక్ష్మి, మనసాల నాగమణి, కో ఆప్షన్ సభ్యులు షాజహన్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నీరు వృథా కాకుండా అడ్డుకట్ట



దెందులూరు సైఫన్ వద్ద అడ్డుకట్ట వేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: ఇటీవల కురిసిన వర్షాలకు పోలవరం నీటితో ఇతర ప్రాంతాల నుంచి అధికంగా వస్తోన్న వర్షపునీరు సైఫన్ వద్ద కృష్ణా కాలువలోకి పోతోంది. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి అంబటి రాంబాబులతో మాట్లాడి దెందులూరు మండలంలో 12 వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేయించారు. ఆ నీరు వృథాగా పోకుండా వైఎస్సార్‌సీపీ దెందులూరు కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు ఆధ్వర్యంలో నాయకులు, పలువురు రైతులతో శ్రమదానం చేసి అడ్డుకట్ట వేశారు. దీంతో మండలంలోని దిగువ ప్రాంతాలకు నీరు వెళుతోంది. కార్యక్రమంలో విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ కమిటీ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి, సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, ఎంపీటీసీ పులిపాటి ఆనంద్, కట్టా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకోవాలి



గుడిపాడులో మొక్కలు నాటుతున్న వడ్డి కార్పొరేషన్ డైరెక్టరు ప్రభాకరరావు

పెదపాడు : దేశం కోసం అశువులుబాసిన మహానుభావులను స్మరించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వడ్డి కార్పొరేషన్ డైరెక్టరు ఘంటసాల ప్రభాకరారవు అన్నారు. నాభూమి నాదేశం కార్యక్రమంలో భాగంగా పెదపాడు మండలం గుడిపాడు గ్రామంలో సోమవారం ఆయన అమర వీరుల స్మృతి చిహ్నాన్ని ఆవిష్కరించారు. దేశం కోసం అశువులు బాసిన వీరులకు జోహార్లర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్లో పంచ ప్రాణ ప్రతిజ్ఞ

దెందులూరు: నా భూమి, నా దేశం కార్యక్రమంలో స్థానిక హైస్కూల్లో సోమవారం పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య, ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోకల రాంబాబు, హెచ్ఎం పసుమర్తి శర్మ, ఉద్యోగులు గ్రామ కార్యదర్శి టీ.శ్రీనివాస్ చౌదరి, ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ కొండపావులూరి శ్రీనివాస్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులు ప్రారంభం

గణపవరం(నిడమర్రు): గణపవరం మండలంలో మంగళవారం రూ.3.45 కోట్ల నిధులతో జరిగిన పలు అభివృద్ధిపనుల ప్రారంభోత్సవంలో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ పాల్గొంటారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీతో పాటు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు కూడా హాజరవుతారని కార్యాలయ ప్రతినిధులు కిషోర్, సుభాష్, రవి పేర్కొన్నారు.

ఐలు మహాసభలు విజయవంతం

ఏలూరు (టూటౌన్): ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ 12వ రాష్ట్ర మహాసభలు గుంటూరులో ఈ నెల 12, 13 తేదీల్లో విజయవంతంగా నిర్వహించామని ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఓరుగంటి శైలజ సోమవారం ఏలూరులో వెల్లడించారు. ఐలూ రాష్ట్ర అధ్యక్షుడిగా సుంకర రాజేంద్ర ప్రసాద్ తిరిగి ఎన్నికయ్యారని, ప్రధాన కార్యదర్శిగా నల్లూరి మాధవరావు ఎన్నికైనట్టు చెప్పారు.

బస్సును పునరుద్ధరించాలి

ఏలూరు (టూటౌన్): పెదవేగి మండలం అమ్మపాలెం గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ స్పందన కార్యక్రమంలో డీఆర్‌ఓకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దళిత సేన కార్యదర్శి పింగుల ఇధియా, లింగపాలెం మండల మహిళా అధ్యక్షురాలు విజయమ్మ, దేవదాసు పాల్గొన్నారు.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

పెదపాడు : ఉప ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించారు. పెదపాడు మండలం వీరమ్మకుంట సర్పంచ్ పదవికి దాఖలు చేసిన 9 నామినేషన్లలో ఏడుగురు ఉపసంహరించుకున్నారు. మరడాని వెంకటలక్ష్మణ సోమేశ్వరరావు (చంటిబాబు), మరడాని నాగబాబు పోటీలో ఉన్నారు. పాతముప్పర్రులో 10వ వార్డు సభ్యత్వానికి బూరాడ సోమేశ్వరి, యండ్రమాక అన్నమ్మలు పోటీ పడుతున్నారు. చంటిబాబుకు కత్తెర, నాగబాబుకు మంచం, సోమేశ్వరికి ప్రెజర్ కుక్కర్, అన్నమ్మకు గౌను గుర్తులు కేటాయించారు. పెదపాడులోని 8వ వార్డుకు గిన్నిపల్లి సోమేశ్వరమ్మ, రాజపేటలో 1వ వార్డుకు తలారి వనజ, 4వ వార్డుకు వడ్లమూడి మరియమ్మ, వసంతవాడలోని 9వ వార్డుకు చింతల ఆనంద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అప్పనవీడులో 7వ వార్డులో బట్టు స్వరూపరాణి, ప్రత్తిపాటి కరుణ కుమారి నామినేషన్ దాఖలు చేయగా, కరుణ కుమారి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో ఈ ఐదువార్డుల ఎన్నిక ఏకగ్రీవమయ్యాయి.